# నిప్పు

"ఆడి రిచ్చా బండికి రిపేరొచ్చిందంటే నేనే సవ్వాల. బాంకుకి వోయిదా గట్టాలంటే నేనే ఏడాల. పిల్లడికి వొళ్ళు యెచ్చబడితే నేనే! ఎవురికి కాలు నొచ్చినా నేనే! కడుపు నొచ్చినా నేనే - "

గోనె గుడ్డ మీద, బోర్లా పడుకున్న మనవడి వీపు మీద జో కొడుతూ, కుడిచేత్తో తల బరుక్కుంటూ, ఉండుండి ఉండుండి ఒక్కొక్క మాట అంటోంది నరసమ్మ. ఆవిడ ఆ యిల్లు అనబడే దానిలో కూర్చుని ఉంది. పగలంటా కాసిన ఎండకి ఆ చిన్న బిడ్డడి శరీరం పేలి పోయింది. గజి బిజిగా వున్న ఆ యిళ్ళ మధ్య దోవ తెలియక ప్రవేశించలేకపోతున్న బాలుడిలా, గాలి ఎక్కడికక్కడే స్తంభించి పోయింది. దానితో గోనె గుడ్డ మీద బిడ్డడు కదిలి పోతున్నాడు.

ముంగాళ్ళ మీదుగా రెండు చేతులూ కలుపుకుని మట్టి గోడకి జారబడి, మాణిక్యం ముంజారులో కూర్చుని ఉంది. ఆమె పక్కనే దాకలో బియ్యం ఉడుకుతున్నాయి. పొయ్యిలో మంట సన్నగా వెలుగుతోంది. పాకేజీ పెట్టెల అట్ట ముక్కలు కాలుతున్న వాసన. దాక మీద మూకుడు మీద ఉన్న తెడ్డు నుంచి గంజి చుక్కలు రాలుతున్నాయి.

యుద్ధ మధ్యంలో ఏర్పడిన తాత్కాలిక విరామాన్ని భంగపరుస్తున్న తుపాకీ మోతల్లా, నరసమ్మ మాటలు వినిసిస్తునాయి.

ఆ యింటినీ, అలాంటి అనేక యిళ్ళనీ కలుపుకుని ఉన్న ఆ పేట పాత సామాన్లవాడి గోనె సంచిలా వుంది. అది ఒకప్పుడు వికృతంగా ఎదుగుతూ ఉన్న నగరానికి నడి బొడ్డున ఉంది. దాన్ని ఒకప్పుడూ, యిప్పుడూ తోట అనే అంటారు. అయితే యిప్పుడు అక్కడ చెట్లు లేవు. మనుషులు ఉన్నారు. వాళ్ళా నగరంలో ఏం చేస్తారో కొందరికి తెలీదు. ఏదయినా చేస్తారని కొందరికి తెలుసు. దానికి ఒక హక్కుదారుడున్నాడు. ఆయన 'పోన్లెస్తూ పేదవాళ్ళుండటానికయినా పనికొస్తోంది' అనుకునేవాడట. ఇప్పుడాయనకు వారసులున్నారట. వాళ్లంతా ఎక్కడో ఉన్నారుట కానీ, వాళ్ళకి యిక్కడ యీ 'బంగారు గని' ఉన్నదని తెలుసునట. తెలియని దూరప్రాంతాల వాళ్ళకి కొందరు 'మంచి బుద్ధి' కలవారు తెలియబరుస్తున్నారుట.

ఆ 'తోట' అనబడే పేటకి తూర్పున రెండు సినిమా హాళ్ళతోనూ, కొన్ని వర్క్ షాపులతోనూ, మరికొన్ని పెద్ద షాపులతోనూ ఎప్పుడూ కళ కళ లాడే ఒక పెద్ద వీధి ఉంది. పడమటను ఒక పెద్ద వీధీ, దాన్ని ఆనుకుని రైల్వే లైనూ ఉన్నాయి. ఉత్తరానా, దక్షిణానా ఉన్న వీధులకూ ఆ తోటకూ మధ్య కొన్ని యిళ్ళు ఉన్నాయి. దక్షిణాన ఉన్న యిళ్ళనూ, ఆ వీధినీ అగ్రహారం అంటారు. ఇప్పుడా వీధిలో సగానికి పైగా యిళ్ళను పరాయి రాష్ట్రాల నుంచీ, ఇతర జిల్లాల నుంచీ వచ్చిన వాళ్ళు కొనేసుకున్నారు. వాళ్ళా ఇళ్ళు పడగొట్టి కట్టిన కొత్త మేడలూ, వాటి పక్కన పాత యిళ్ళూ - ఎవరో అసమర్థ చిత్రకారుడు చిత్రించిన అపరిపక్వ చిత్రంలా - ఉన్నాయి.

దక్షిణాన ఉన్న ఆ యిళ్ళ వరస నుంచి, వాడిన నీరు పోవటానికి, ఒకప్పుడు ఉపయోగపడ్డ మురుగు కాలవ యిప్పుడు మధ్య మధ్యలో ఏర్పడిన ప్రతిబంధకాలతో ప్రవహించటం మానేసి ఎక్కడికక్కడే నిలిచి పోయింది. ఆ యిళ్ళన్నింటికీ వెనక వేపునుంచి ప్రవేశించి, ఆ యిళ్ళ దొడ్లను శుభ్రం చేయటానికి కన్నాల వంటి పెరటి ద్వారాలున్నాయి. ఆ కాలవని ఆశ్రయించుకుని బ్రతుకుతున్న దోమలు, ఆ యిళ్లకూ, యీ గుడిసెలకూ వెళ్ళి, రక్తాన్ని సేకరించుకుని వస్తున్నాయి. అనేక రకాల సాధారణ ఆపదలు అందరినీ సమానంగా బాధించలేనట్లే, ఆ దోమలు కూడా దోమ తెరలనూ, ఫినాయిలు వాసనలనూ, ఎలక్ట్రానిక్ పరికరాలతోనూ పోరాడే శక్తి లేక, బాధలకు అలవాటయిన వారినే బాధించుతూ సులువుగా బ్రతుకు తున్నాయి.

అలాంటి సోమరి దోమ ఒకటి వచ్చి నరసమ్మను తనివిదీరా కుట్టింది. ఆవిడ దానిని టప్‌మని కొట్టింది. జో కొట్టటానికి అంతరాయమవటంతో పిల్లడు అటూ, యిటూ కదులుతూ బుర్ర పైకెత్తాడు.

"యెదవ సంత - యెదవ సంత" వాడి బుర్రని ఒక చేత్తో అణచి, మరో చేత్తో జో కొట్ట సాగింది.

"యేటప్పా - అంటున్నావ్ - ?" గుమ్మంలోంచి వెళ్తున్న లచ్చుమ్మ నరసమ్మను పలకరించింది.

"లేటయ్యిందేటీ!" అంది నరసమ్మ.

"ఒక్క చెణం, ఒక్క చెణం అంటా వొగ్గలేదు మా మేస్త్రీ"

"అంతేలేయే - దినవల్లా మనం పాటడతానే వుంటాం! మన పాటు గావాల గానీ - మన మాటెవుడింటాడులే - రాయే! కూకో - " పిలిచింది నరసమ్మ.

లోపలకు వెళ్తున్న లచ్చమ్మను చూసి, మూతి తిప్పుకుంటూ, తెడ్డు తీసి దాకలో కలియ బెట్టసాగింది మాణిక్యం.

తాళ్ళు కట్టి వాడుతున్న హవాయి జోడునీ, చుమ్మ గుడ్డనీ చేతిలోంచి కింద పెట్టి, పక్కనే చతికిల బడింది లచ్చమ్మ. కుండలోంచి సిల్వరు గ్లాసుతో నీళ్ళు తీసి యిచ్చింది

నరసమ్మ. అవి గొంతులోకి పోసి, కొంచెం పుక్కిలించి ఊసి, మిగిలినవి గట గటా తాగేసింది లచ్చుమ్మ. తాగి, "ఏటయిందేటప్పా?" రొంటిన, చీర మడతలో దాచిన, పొగాకు రెబ్బ తీసి, వాసన చూస్తూ అంది లచ్చుమ్మ.

"ఏటవుద్ది? ఎవురి అమ్మగోరింటికారు ఎల్తారు - ఎల్లినాక, ఆరింట పాటడతారు - అత్తింటికొచ్చి, అసురుసురంటారు - "

"ముసలి ముండలిద్దరూ చేరారు...." పొయ్యిలో పుల్ల ముక్కతో అట్ట ముక్కలను కదిపింది మాణిక్యం. ఆమె గొంతు వాళ్ళిద్దరికీ బాగానే వినిపించింది.

"అనీదేటో కాంత గట్టిగా అనవే కోడలా" అంది లచ్చుమ్మ నవ్వు గొంతుతో.

"సెవతందిగా.. మీ ... యప్ప ... యిను! యిను!"

"అవునే లచ్చుమ్మా - నానే సెపుతాను - ఆ పొద్దు లెగిసి, ఆ యింటా, ఈ యింటా అంట్లే తోవంతన్నానో .... గుడ్డలే గుంజతన్నానో... నీళ్ళే మోస్తన్నానో .... ఏ సావు సస్తన్నానో ఆ సూరినారాయణ మూరితికే తెల్సు! నాకు దెల్సు! ఆరూ, యీరూ యెట్టిన వణ్ణం..... పోసిన గెంజీ .... అక్కడే మింగీకుండా.... నా బిడ్డున్నాడూ .... ఆడి పెళ్ళాం వున్నాదీ.... ఆళ్ళ కడుపున బుట్టిన బిడ్డడున్నాడూ ..... అనే గదా .... కడుపు గట్టుకుని.... యింటికి పట్టుకొత్తన్నానూ .... యీళ్ళకి మింగబెడతన్నానూ.....! నీకు విస్సవోసం వుందంటే - ? ఓ పూట - యిదిగిదిగింత - తక్కువవుతే అవుద్ది .... నేను యెట్టనేకపోతే యెట్టక పోతాను - నీ అన్న టిపిన్లమ్ముకునీ వోడవుతే అవుతాడు. ఆడు పచ్చగా వుంటే వుంటాడు.....! ఆడింట దూరడవేఁవీ? పొద్దుటెల్లి పొద్దుడీదాకా ఆడింట సేరడవేఁవీ" అంటూ ఉంది నరసమ్మ.

"అవునో..... లమ్మ! అందంట నాకు రంకు మగలున్నారు....." అంది మాణిక్యం మధ్యలో.

"సూసావా - సూసావంటే - దాని మాటలూ, దాని యెవ్వారమూ - " అంది నరసమ్మ.

"అంత గీరువోణం ... తగదే ... మాణిక్కెం" అంది లచ్చుమ్మ పుగాకు కొస నములూ.

ఒక్క ఉదుటున లేచింది. మాణిక్యం. ఒక్క అంగలో, గదిలో ప్రవేశించి, నిలువెల్లా ఊగిపోతూ అందుకుంది.

"ఏటే ... ఏటంట గీరువోణం - ? ఆడేటి పయ్యోడా? సాయానా ... నా అన్నదమ్ముడు! నా అన్నదమ్ముడే... ఆడు! ఆడింటికి నానెల్లి ఆడెట్టింది తెచ్చుకుంటన్నానో ... ఆడికే యెడతన్నానో ... యీ ముసలి బొప్పికి తెలదా? నా యిట్టవేఁ .... నా అన్నదమ్ముడింట పిండే రుబ్బుతానో ... పిల్లల్నే ఎత్తుకుంటానో ... నా యిట్టం. నా పెనిమిటి సాతగాని నాయాల గాబట్టే దీని యేసా లీలా సాగతన్నాయి - అవునవునల్లా - వొయిసులో ఆడెంటా యీడెంటా దిరిగినోళ్ళకి అట్టాంటి అనుమానాలే వొత్తాయి - "

ఆ మాటకి నరసమ్మ చువ్వలా లేచింది. నిప్పులో పడ్డ ఉప్పులా టప్ టప్ మంటూ అందుకుంది - "ఓలోలి నంగనాచీ.... నువ్వు నీ అన్నదమ్ముడింట ఎందుకు సేరతన్నావో సెప్పెయ్యమంటావా - ? సెప్పెయ్యమంటావుటే- ?"

"సెప్పు - సెప్పు సూద్దారి"

"సెప్పవే అప్పా - నీ కడుపులో ఏటుందో సెప్పెయ్యి - " అంది లచ్చమ్మ.

నరసమ్మ చెప్పలేదు. మాణిక్యం ఆమె అన్న యింటికి చుట్టపు చూపుగా వెళ్ళటం లేదు. అతని హోటలు కొట్టులో పని చేస్తోంది. ఆ పని చేస్తే ఎవరి కయినా ఎంత దొరుకుతుందో ఆమె ఆరా తీసింది. వాళ్ళు అంటున్న దానికన్న పావలా, అర్ధా మాణిక్యం ఎక్కువే తెస్తోంది. అయినా, కోడలుకి ఆమె అన్న గనక యింకా ఎక్కువ యిస్తున్నాడని ఆమె అనుమానం. అదంతా మాణిక్యం తనకు యివ్వటం లేదని ఆమె నమ్మకం. ఇవ్వక కోడలు ఏం చేస్తోందని నరసమ్మ ఎన్నడూ ఆలోచించలేదు. ఇస్తే, ఇంట్లో యింత కట కట ఉండేది కాదని ఆవిడ నమ్మకం. ఇంత విడమరిచి చెప్పడం ఆవిడకి చేతనవలేదు.

దానితో నరసమ్మ సణుగుతూ - ఈ కుటుంబానికి ఎంత కష్టపడుతున్నదీ - దాని కెలాంటి విలువ లేకుండా ఎలా పోతున్నదో - మరోమారు మాట్లాడసాగింది.

నరసమ్మ గొంతు తగ్గటంతో మాణిక్యం విజృంభించింది.

"ఇదీ - దీని కొడుకూ యేసే యేసాలు అలాంటిలాంటియ్యి కావు - నా కొడుక్కి సూది మందు యెయ్యించాలంటే దీనికాడ పైసా వుండదు. దాని కొడుక్కి సారా పాట్లాలు గావాలంటే రూపాయలకు రూపాయలు రాల్తాయి . నేను నా అన్న కాడికి ఎల్లి ఆడి కాళ్ళట్టుకుని, నా కొడుకుని డాక్టరికి సూపించాల్లంట - "

"అదేటప్పా - తప్పుకాదంటే - " అంది లచ్చమ్మ.

"అది గది, గలా గడుగు - " అంది మాణిక్యం జోరుగా చేతులూపుతూ.

తన సైన్యమంతా శతృవు సైన్యంలో చేరిపోయిన నాయకుడిలా, తన పార్టీ అంతా ప్లేటు ఫిరాయించేసిన పార్టీ నాయకునిలా అయిపోయింది నరసమ్మ. ఆవిడ లేచి నిలబడి - "ఏటే - ఏటా సేతులూపటం - కొడతావా - రాయే - కొట్టి సూడవే - ముసల్దాన్నయిపోయానను కుంటున్నావేమో - ఎముక లిరిసెయ్యగలను -"

అలా మొదలయింది.

మాటలు తిట్లయ్యాయి. తిట్లు సవాళ్ళయాయి. ఇద్దరూ చేతులు ఊపుకున్నారు. దీర్ఘాలు తీసుకున్నారు. ఒకరి మీద కొకరు దూసుకెళ్ళారు. ఇంట్లోంచి బయట కొచ్చారు. ఒకరి చేతులొకరు తోసేసుకున్నారు. పట్టుకున్నారు. కలబడ్డారు.

పేటలో జనం పోగడ్డారు.

"అత్తా కోడళ్ళ తగువు - "; "ముసిల్ది మా కానిముండ"; "పడుసుది తక్కువ తిందా - ?"; "ఎవుడితోనే మరుగడిందంట - ముసల్దానికి అనుమానం -"; "కడుపుగాలిందాన్నీ అడ్డగల్దేటి?"; "కడుపు గాలినోళ్ళంతా ఒళ్ళమ్ముకుంటారా?"

ప్రశ్నలు. జవాబులు. జనం వ్యాఖ్యానాలు.

★ ★ ★

దక్షిణాన అనేక డాబా యిళ్ళున్నాయి. వాటిలో ఒక దాని మీద తాత్కాలికంగా

అమర్చిన ఒక లైటు ఉంది. దాని కింద కొందరు కుర్రాళ్ళు ఉన్నారు. వాళ్ళ దగ్గర పుస్తకాలున్నాయి. వాళ్ళవి చదువుకుంటున్నారు. వాళ్ళ మనసులలో పరీక్షల భయాలున్నాయి. వాటి వెనక భవిష్యత్తుందనే నమ్మకాలున్నాయి.

ఆ కుర్రాళ్ళకు కాస్త దూరంగా మరి కొందరు కుర్రాళ్ళున్నారు. వాళ్ళు పేక ఆడుకుంటున్నారు. వాళ్ళలో రామకృష్ణ ఉన్నాడు. రామకృష్ణకీ, పరీక్షలకీ సంబంధం దీర్ఘకాలికమైనదయి ఉన్నది. అతను పదే పదే ఏ పనయినా చేస్తాడు. పరీక్షలు పదే పదే రాస్తాడు. అలాగే బూతులు పదే పదే మాట్లాడతాడు. అలాగే సినిమాలు పదే పదే చూస్తాడు. అలాగే అతను పదే పదే పేకాట ఆడతాడు. ఆ రోజు అతను ఆ పని చేస్తూండగా 'డ్రాప్' చేయాల్సివచ్చింది.

అతను లేవాల్సి వచ్చింది. గాలి ఆడుతున్నట్లు లేదు. ఉక్క పోస్తున్నట్లు ఉంది. అతను పిట్టగోడ దగ్గరకి వచ్చేసరికి తోటలో గొడవ కనబడింది. శరీరం అంతా విద్యుత్ప్రసారమయినట్లయింది. విజిల్ వేసాడు.

"ఏం సీను గురూ - ఏం సీను - " అంటూ పరుగెత్తాడు కిందకి.

"వీడికేం రోగం వచ్చింది - " అంటూ పేకాట వాళ్లు లేచారు. వాళ్లు ఆ ఆడవాళ్ళ పోట్లాట దృశ్యాన్ని చూస్తూంటే - అందులో ఒకడు - "బాసు టేస్టు బ్రహ్మాండం - బైనాక్యులర్స్ కోసం పోయుంటాడు - " అన్నాడు.

"కుర్రది కత్తిలాగుంది - "

"ముసల్ది పిక్కలాగుంది - "

"కుర్రదాని గుడ్డలూడిపోతాయని బాసు ఆశ - "

"ముసిల్దానివి ఊడితే - ?"

నవ్వులు.

రామకృష్ణ తిరిగి వచ్చేసరికి పేకాట వాళ్ళు, ఆ తర్వాత చదువుల వాళ్ళూ అక్కడకు చేరారు.

"వాళ్ళ తగువును ఎంజాయ్ చేస్తున్నారా - మీకు బుద్ధి లేదూ?" అన్నాడొకడు.

"వాళ్ళని ఎంజాయ్ చేయమనా గురువా - నీ బోధ!" అన్నారింకొకరు.

"వారందులకు ఒడంబడరు -" అన్నారొకరు.

మొదట అన్నవానికి కోపం వచ్చింది.

"మనలాంటి స్టూడెంట్స్ యిలా ఏడిస్తే - యీ దేశం గతి యింతే -"

"అటులనా - పద! పోయి వారిని విడిపించెదము - "

"ఆ పని మనం ఎలాగూ ఏడవలేం - కనీసం అలాంటి వాటికి ఎంటర్‌టైన్‌మెంట్ వాల్యూ యివ్వకుండా ఉంటే చాలు -"

"ఏం తండ్రీ - మనం చూడకపోతే వాళ్ళు గొడవలాడుకోరా?"

"ఎందుకాడుకోరు - ! వాళ్ళ కష్టానికి గూడా, మనలాంటి బొక్కి పుస్తకాలు చదివి బొక్కి

పరీక్షలు రాసి సంపాదించే డబ్బు - దొరికిన రోజున - వాళ్ళూ అలా గొడవాడుకోరు -మనబోటి గాళ్ళ యిళ్ళలో దెబ్బలాడుకునే పద్ధతిలో గుంభనంగా, మర్యాదగా దెబ్బలాడుకుంటారు -"

"అమ్మ - అమ్మ - వీడు ఏం ఉపన్యాసం దంచుతున్నాడూ -?"

అతను హాస్యంగా భావించే ఆ మాటకి ఎవరూ స్పందించలేదు.

"కనీసం ఈ వయసులో కూడా నువ్వు ఆవేశం చెందవలసిన వాటికి చెందకపోతే - నిన్ను చూస్తే జాలేస్తోంది -" అని అతను వెళ్ళి పుస్తకం తీసుకున్నాడు. క్రమ క్రమంగా చాలా మంది అతన్ని అనుసరించారు.

ఇద్దరు ముగ్గురు మాత్రం పిట్టగోడ దగ్గర నిలబడి తోటలోకి చూస్తున్నారు.

★ ★ ★

పెరటి గోడకి అటువయిపు జరుగుతున్న గొడవను, రవణమ్మ వసారా మీద నుంచి, కాళ్ళు ఎత్తి ఎత్తి చూస్తోంది. దీపం వెలిగించి దేవుడికి దణ్ణం పెట్టుకుని లోపలి నుంచి వచ్చింది ఆమె అత్తగారు.

"ఏవిటే ఆ గొడవ -?" "కుతూహలంగా ప్రశించింది.

"ఆ అత్తముండ - పాపం - కోడలిని తంతోంది అత్తయ్యా -" అనేసి నాలిక కరుచుకుంది రవణమ్మ.

ఆమె భయపడినంతగా, ఆమె మాటను అత్తగారు పట్టించుకోలేదు - "ఎవత్తే అది?" అంది కొంగుతో మెడ క్రింద చెమట ఒత్తుకుంటూ.

"అదేనండి - భజనలో అస్తమానూ పట్టుచీర కట్టుకుని తిప్పుకుంటూ వస్తుందీ - రామలక్ష్మమ్మగారూ - వాళ్ళంట్లో పని మనిషి -" అంది. రామలక్ష్మమ్మ పేరు ఎత్తి, చేసిన పొరపాటును సర్దుకోవాలని రవణమ్మ ఎత్తు.

"శని ముండలు - ఎప్పుడూ ఎందుకో అందుకు గొడవాడుకు చస్తుంటారు -"

"అవునండి -"

"కాస్త పీట తీసుకురావే -" కోడలికి పురమాయించింది. రమణమ్మ మూతి తిప్పుకుంటూ వెళ్ళి ముక్కాలి పీట తెచ్చింది. నెమ్మదిగా కోడలి సాయంతో దాని మీదకి ఎక్కింది అత్త. తోటలో గొడవ ఆవిడకి కనిపిస్తోంది. ఆవిడ ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆరంభించింది.

"మధ్యలో యింకెవత్తో వచ్చిందోసేవ్ - దాన్ని, ఆ పడుచు ముండ తోసేస్తోంది. అమ్మో - అమ్మో - ఎంత బలమో - ఆ ముసల్దాని తల ఊడి చక్కావస్తుందో ఏమో -"

ఆ వ్యాఖ్యానం విని లోపలి నుంచి మహలక్ష్మి బయటికి వచ్చింది. ఆవిడ వాళ్ళింట్లో అద్దెకుంటోంది. కొన్నాళ్ళుగా ఆవిడకీ, యింటి యజమానురాలికీ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ప్రత్యక్ష స్థాయికి చేరుకుంది.

"ఏమిటండీ పిన్నిగారూ చూస్తూ ఉన్నారూ-" అంటూ ఆవిడ ఎంతో 'సహజ కుతూహలం' తో ప్రశ్నించింది. దాన్ని యజమానురాలు ఆ విధంగా తీసుకోలేదు. ఈనెపాన, తన యింట

అద్దెకుండే ప్రాణి తనబోటి దాన్ని మంచి చేసుకునేందుకు మాట కలుపుతున్నట్లు పసిగట్టింది. అలాంటి కుటిల రాజకీయాలకు లొంగనే లొంగననే 'స్వచ్ఛ రాజకీయ నాయకుని' గొంతుతో ఆరంభించింది.

"ఈ పేటలో, ఈ దరిద్రగొట్టు యిల్లు కొనొద్దన్నను. విన్నాడా - వినలేదు. చస్తూ చస్తూ యీ భారాన్ని నా నెత్తిన పెట్టాడు. అద్దెకు దిగినవాళ్ళెంతమందిని చూసానూ - ఎంత అగ్గగ్గలాడతారూ - ఇదేం కర్మ? మా మానాన మమ్మల్ని ఉండనివ్వరు. అన్నీ మా గొడవలే కావాలి - వెధవ సంత -"

ఆవిడ అలా కవ్వించినా మహలక్ష్మి, ఆవిడ ఆనందిస్తున్న వినోదాన్ని చూడాలనే చాపల్యం వల్ల, కవ్వింపబడలేదు. తనూ ఒక పీట తెచ్చుకుని చూస్తూ ఆనందించసాగింది.

"అయ్యో - అయ్యో - దీని దురన్యాయం మండిపోనూ - ఆ ముసలి ముండని చంపేస్తుందేమోనే -"

అంటూ ఆవిడ అత్యుత్సాహంతో మడమలు ఎత్తి చూడబోవడం - నించున్న బల్ల మీద భారం గరిమనాభి తప్పడం - ఆవిడ సువిశాల దేహరాజం నేల కూలడం - ఉబికి, ఉబికి వస్తూ ఉన్న నవ్వుని అణుచుకుంటూ కోడలు 'అయ్యో అయ్యో' అనడం -

★ ★ ★

ఆ గదిలో కాంతి నీలంగా ఉంది. అది అక్కడుండగలిగే వాళ్ళ సంక్షేమం కోసం తపస్సు చేస్తున్న మునిపుంగవుని తేజంలా గంభీరంగా కూడా ఉంది. అది ఆ వరసలో, కొత్తగా వెలసిన, కొత్త యింటి మొదటి అంతస్తులో ఉంది.

అందులో ఉన్న మనిషి, కోటేశ్వరరావు. అతను అందరిలాగా యింట్లో వుండి విశ్రాంతి తీసుకునే వ్యక్తి కాడు. అయినా, అతను అప్పుడు ఆ పనే చేస్తున్నాడు. అతని అదృష్టమో - దురదృష్టమో - అతని కిటికీ అవతల జరుగుతున్న అత్తా కోడళ్ళ పోట్లాట అతని కంట కూడ పడింది.

అతనికి అనేక భావాలు కలుగుతున్నాయి. వాటిని ఎవరితోనయినా, పంచుకోవాలని అతనికి ఉంది. జీవితంలో తీరిక కరువవుతున్న కొద్దీ - మనిషిలో ఒంటరితనం పెరగడం అతనికి అనుభూతమవుతోంది. వ్యవహరించవలసిన వాళ్ళ సంఖ్య తరుగుతున్నట్లు కూడా అతనికి అన్పిస్తోంది. తన భావాలు పంచుకోటానికి, తగిన భార్య లేనందుకు, ఉన్న సరోజం చాలనందుకు, అతనికి చికాకుగా ఉంది.

అలా చిరాకు పడుతూండగా, చిదానందరావు వచ్చాడు. చిదానందరావు దృష్టిలో తనొక కవి. కవిత్వమంటే పద్యాలనీ, కవి అంటే పద్య పుస్తకాలను అచ్చువేసేవాడనీ, మహాకవి అంటే మరీ ఎక్కువ పద్యాలు రాసి, 'అచ్చేసే'వాడనీ; ప్రజాకవి అంటే ప్రజల భాషగా అతననుకునే దానిలో రాసి, అచ్చేసి, అది పట్టుకుని వినసొంపుగా అతను భావించిన పద్ధతిలో చదివి, విన్న వాళ్ళ సెబాసులును నొల్లుకుని, శాలువాలు కప్పించుకునే వాడనీ, సినిమాల స్వర్గానికి యివన్నీ ద్వారాలనీ - చిదానందరావు నమ్ముతాడు. అందులో కొన్ని భావాలను జాగ్రత్తగా అమ్ముతాడు.

ఆ కోటేశ్వరుడూ, యీ చిదానందుడూ ఒక కూడలిలో కలిసారు. అచ్చు వెయ్యటానికి డబ్బు కావాలి. డబ్బు ఉన్నవాళ్ళకి పేరు కావాలి. అంకితాలు, సన్మానాలూ - ఆ రెంటి మార్పిడికీ పద్ధతులు. అవి జరిగే కూడలులో వాళ్ళిద్దరూ కలిసారు.ఎవరి అవసరం కొద్దీ వాళ్ళు రెండో వాళ్ళతో కలిసి నడిచారు. చిదానందరావు అవసరం కోటేశ్వరుడికి తెలుసు. అతని అవసరం యితనికి అంతా తెలియదు. తన డబ్బు, తన పోసే మందూ తప్పించి మరేమీ ఈ కవి ఆశించడని ఆ ప్రభువికి తెలిసేక అతనిని తన గదిలోకీ, మదిలోకీ రానిచ్చాడు.

చిదానందుడెప్పుడూ అతనిని చిరాకు పరచలేదు. నిరాశ పరచలేదు. కిటికీ దగ్గరికి తీసుకెళ్ళి, అతనికి కోటేశ్వరరావు జరుగుతున్న కొట్లాటను చూపించాడు.

"ఈ తోటలో ప్రతి రోజూ ఏదో ఒక గొడవ. కొట్లాట. ఎందుకలా జరుగుతోంది కవీ! -" అని అడిగాడు.

అతనా ప్రశ్న అగటంలోని సీరియస్ నెస్‌ని పట్టించుకోలేదు కవి.

"ఎలా గొడవాడు కోవాలని స్వామీ - తమ కోరిక -?" అంటూ వెళ్ళి చొరవగా మందు సీసా తీసుకుని దాని మీది పేరునీ, అది తయారు చేసిన దేశాన్నీ, ఆ దేశానికున్న పేరునీ బట్టి, దాని వాసనను పీలుస్తూ గ్లాసుల్లో నింపసాగాడు.

చిదానందరావు నాటక ఫక్కీ మాటని విని కూడా కోటేశ్వరరావు కిటికీని వదలలేదు. గ్లాసులో పదార్థాన్నీ, దానిలో నీరు చేర్చగా ఏర్పడిన రంగునీ, ప్లేట్లనీ, వాటిల్లోని తినుబండారాలనీ, చూసి తృప్తి పడ్డాక కవి అతని వేపు తల తిప్పాడు. అప్పుడతనికి తన జోకు పేలలేదన్న విషయం గుర్తొచ్చింది.

కిటికీని సమీపించి, రావు ప్రక్కన నిలబడి బయటకు చూసాడు. ఆడవాళ్ళిద్దరూ జుత్తులు పట్టుకుని ఒకరి నొకరు తోసుకుంటున్నారు.

కవి గొంతులో విషాదం నింపుకొని - "బుద్ధుడు కథ నిజమేనని యిప్పుడర్థం అవుతోంది సార్ - ఆ పేదల మీద మీ మనసులో కదలుతున్న బాధ గమనిస్తుంటే - క్షమించండి రావుగారూ - జోక్ వేసాను -"

కోటేశ్వర(రావు తల తిప్పాడు. అతనూహించినట్లే కవి అమర్చిన గ్లాసులు కనిపించాయి. ఆ తర్వాత కవిని చూసాడు. రావు పెదాల మీద చిత్రమయిన నవ్వు మొలిచింది.

'నువ్వన్నది నిజమే -' అన్నట్టుంది ఆ నవ్వు.

ఆ మొలక నవ్వు పెద్ద నవ్వయింది.

ఆ నవ్వు చిదానందునికి - 'నీ బాబు గోరి సొత్తులా ఏర్పాట్ చేసావ్‌రా నా కొడకా -' అంటున్నట్టనిపిచింది.

'మందు కోసం - మహా మహా వాళ్ళు ధనమూ, ప్రాణమూ యిచ్చేసారు. మనకున్నట్లు కనిపించేది మానమే గదా - దాన్ని యిచ్చేసినా ఫరవాలేదు -' కవి దులిపేసుకున్నాడు.

ఛీరులు - ముగిసాయి. గ్లాసులోది సగానికి పైగా నోట్లోకి పంపేసి, రాచపీనుగ తోడు

లేకుండా చావదన్నట్లు గుప్పెడు జీడిపప్పుల్ని ఒక్కమారుగా లోపలికి పంపాడు.

చిన్నగా సిప్ చేసిన రావు, కవి గ్లాసు వంక ఓరకంట చూస్తూ, ఒక్క పలుకు తీసి మునిపంటితో కొరికాడు.

"కలిగిన వాళ్ళకి పేదాళ్ళ మీద కనికరమే లేకపోతే - భూమ్మీద మానవజాతే ఉండేది గాదు -" గొప్ప సత్యాన్ని యిష్టమయిన వాళ్ళకి చెపుతున్న గొంతుతో అన్నాడు.

కవికి ఆ మాటల్లో ఏదో ధ్వని ఉన్నట్లనిపించింది. ఆ ధ్వని ఏదో తనకు అర్థం కాలేదని ఏదుటి వాడికి తెలిసి పోతుందన్నట్లు బిగిగా కూర్చున్నాడు.

జగన్నాధుడినే తిట్టే సందర్భం ఒకటి - ఆయన రథయాత్ర ముందు ఉన్నప్పుడు - ఆ తిట్లతో కూడా ఆయన సంతోషపడే అవకాశం ఉన్నప్పుడు - మామూలు నాధంలకెందుకు ఉండదు -? ఈ ప్రశ్న మీద ఆధారపడి కవి ఒక థీరీ తయారు చేసుకున్నాడు. దాని ప్రకారం, మందులో రెండు లార్జిలు పూర్తయ్యాక, తను తాగి వాగుతున్నానన్న నమ్మకం ఎదుటి వాడికి కలిగినపుడు, అప్పుడు తను తిట్టి ఎదుటి వాడిని సంతోష పరచవచ్చున్నది కవి థీరీ.

సందర్భం అంత దాకా రాలేదు -

"ఈ రోజు మీరు మాట్లాడటం లేదు -"

"మనసు బాగా లేదోయ్ కవీ -" అన్నాడు.

ఎందుకు బాగో లేదని ఆలోచించలేదు కవి - "ఎలా బాగుంటుంది సార్ - లోకంలో దుఃఖమున్నపుడూ - మనం బుద్ధులమయినపుడూ -" అంటూ గ్లాసు పూర్తి చేసి రావు వేపు చూసాడు. తర్వాత నవ్వాడు -

"యేపిన కోడి లెగ్గూ - యిస్కీ పెగ్గూ కాంబినేషన్ ఎట్టాంటిదో - సరిగ్గా అట్టాంటిది సార్ మన లైఫూ - ఆళ్ళ ఫైటింగు సీనూనూ -" అన్నాడు ఉపమానంలో తప్పేమయినా ఉందేమోనని వెతుక్కుంటూ -

ఉపమానాలన్నవి వీర తెలివికి వీర నిదర్శనాలని - ఒకమారు కవే అన్నాడు. కాస్త ధనం కలిగి, మరికాస్త విశ్రాంతి కలిగి, యింకాస్త తెలివి కలిగిన వర్గాలకు ఉపమానాలు బ్రహ్మాండంగా పడతాయని గూడా కవి అనుమానం.

"వాళ్ళలో వాళ్ళు అలా తగువులాడుకుంటే భయం వెయ్యదా?" కోటేశ్వరరావు ప్రశ్నించాడు.

"భయమా -!" అని తెచ్చిపెట్టుకున్న పెద్ద నవ్వు నవ్వాడు - నవ్వు ఆపుకుంటున్నట్లు - "ఆళ్ళు తన్నుకు తన్నుకు సచ్చారనుకొందాం - మన తలలు నరకటానికి యీ భూమ్మీద యెవరూ మిగలరు - పట్రండి - వెయ్యి రూపాయల నోటు మీద రాసియ్యగలను -" అన్నాడు.

"అప్పుడు నీకా జీడిపప్పు పండించటానికీ, మందు తయారు చెయ్యటానికీ మనుషులెలా వస్తారు -?" కోటేశ్వరరావు కాస్త సీరియస్‌గానే అనుమానం వ్యక్తం చేసాడు.

కవి కాస్త నివ్వెర పోయడు.

రావు లేచి అతని భుజం మీద తట్టి కిటికీ దగ్గరకు వెళ్ళాడు. కవి తేరుకుని - "అమ్మ -

అమ్మ - ఎంత దూరదృష్టి -" అంటూ అతన్ని అనుసరించాడు. కవి దగ్గరకు వచ్చాక అతనికి కిందనున్న దొడ్డి గుమ్మం వేపు చూపిస్తూ -

"ఆ గుమ్మం గడియ తీసి ఉందా - నాకు సరిగ్గా ఆనటం లేదు - చూడు కవీ?" అని ప్రశ్నించాడు.

'ఇంత రసవత్తర సమయంలో కూడా నీకు తాపత్రయం వదల లేదు - అందుకే నువ్విలా ఎదిగి పోతున్నావ్ -' అని విసుక్కుని ఆ గుమ్మం వేపు చూసాడు. గడియ తీసి ఉంది.

"తీసేసి ఉంది, వేసిసి రమ్మంటారా?" అన్నాడు కవి.

"తీసి ఉంది గదా - యిప్పుడు చెప్పు - అందరూ చస్తే మనకివ్వన్నీ ఎలా వస్తాయి?" తన సీటులో కూర్చుని గ్లాసు అందుకున్నాడు రావు.

గొంతులో తేడా ఏదో పసి కట్టిన కవిలో కుతూహలం పెరిగింది.

"అర్ధరాత్రి వేళ - లావెట్రీలు కడగటానికి - ఎవరొస్తారుసార్"

"నా కొంపలో వాళ్ళు కడిగే దొడ్డున్నాయా -" రావు గ్లాసు కింద పెట్టాడు. అలవర్చుకున్న నిదానం చెడింది. జీడిపప్పులు నమలసాగాడు.

"నిజమే - నిజమే - అయితే అదేదో అతివల రహస్య ప్రవేశ, రహస్య ద్వారమా?" కవికీ, రావుకీ మధ్య స్త్రీల కబుర్లు ఎన్నడూ రాలేదు. అందుకే కాస్త సంకోచంతో అన్నాడు.

"తోటలో ఆడాళ్ళు నీలాంటి వాళ్ళకి సరిపోతారు - కదా!" అన్నాడు రావు - అదోలా నవ్వుతూ! ఆ నవ్వులో 'మీయింటి ఆడాళ్ళు మా పక్కలకు సరిపోతారు' అన్న ధ్వని ఉంది.

"అవున్సార్ - మీరు తలుచుకోవాలి గాని - మహారాణులు - మహా మహా హీరోయిన్లు -" అన్నాడు చిన్నబుచ్చుకున్న ముఖంతో కవి.

ఆ దొడ్డి దోవమ్మట తోటలో వాళ్ళు దొంగ సరకు తీసుకువస్తారు. ఆ రోజు రావు అటువంటి దాని కోసం ఎదురు చూస్తున్నాడు. అందుకోసం గడియ తీయించి ఉంచాడు. ఆ విషయాన్ని అక్కడితో కత్తిరించటానికి, రావు కవిని అతని సైజుకి కత్తిరించాడు.

★ ★ ★

తన బిడ్డని తీసుకుని, చంకలోకి ఎత్తుకుని పరుగెత్తింది మాణిక్యం.

"అయ్యో - అయ్యో - ఎక్కడికి పోతావే -" అంటూ వెనకనే పరుగెత్తింది నరసమ్మ. ఆమె వెనకే లచ్చమ్మ, మరికొందరూ పెరుగెత్తారు.

నరసమ్మ పడమటి వేపు రోడ్డు చేరేసరికి, కొడుకు ఏదో బేరంతో రిక్షాలో వస్తున్నాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళి రిక్షా హేండిలు పట్టుకుని ఆపేసి - "నా కొడకో - నా దేవుడో - అది సచ్చిపోతానని పరుగెట్టిందిరో -" అంటూ ఏడవసాగింది.

బ్రేకు వేసి బండి ఆపి, విషయం అర్ధం చేసుకున్న దేవుడు సీటు మీంచి ఊరికాడు. రిక్షాని అక్కడే అలాగే వదిలి. పెళ్ళాం వెళ్ళిందన్న వేపు పరుగెత్తాడు.

'ఒక్క చిన్న మాట అన్నందుకు ఎన్నెన్ని మాటలంది అత్త! ఎందరితో రంకులు కట్టింది!

గుడిసేటి పనులు చేసినవాళ్ళయితే ఒంగొంగి పోతారు. తనేల ఒంగి పోవాల? ముసల్ది గదా అని చూస్తే ఎన్ని దెబ్బలు కొట్టింది! ఛత్! తనూ, తన బిడ్డా ఏ రైలు కిందయినా పడిపోవాల -' అనుకుంది మాణిక్యం.

ఆవిడకి ఆవేశం ఆగటం లేదు. ఆలోచన సాగటం లేదు. దాంతో ఆమె కాళ్ళలో వేగం తగ్గింది. ఎక్కువ దూరం వెళ్ళలేదు.

సరిగ్గా వెనుక నించి వచ్చి దేవుడు ఆమె కొప్పుని ఒడిసి పట్టుకున్నాడు. 'చావవే లంజా -' అంటూ రోడ్డు మీదకు ఒక్క తోపు తోసాడు. వస్తూవున్న లారీ సడన్ బ్రేక్‌తో ఆగింది. రోడ్డు మీద పడిన మాణిక్యం తలకి ఏదో తాకింది. తల దిమ్మెక్కింది. భగ్గున మంట. రక్తం చిమ్మింది. కొడుకుని మాత్రం వదల్లేదు. రెక్క పట్టుకుని పైకి లేపి - 'ఎక్కడికి పోతావే - నంజికానా -!' అంటూ తిట్లూ గుద్దులూ! జనం చుట్టూ చేరారు. అటు వాహనాలు అటూ, యిటువి యిటూ ఆగిపోయాయి.

నరసమ్మ జనాన్ని తప్పించుకొని లోపలికి వెళ్ళింది.

"నేను రానల్లో - నన్ను సంపేత్తన్నాడల్లో -" అంటూ అరుస్తోంది మాణిక్యం. ఆవిడ చంకలో బిడ్డడు కిల్లు పెట్టి ఏడుస్తున్నాడు. మొహం మీంచి రక్తం కారుతోంది. దేవుడు పట్టు బిగించుతున్న కొద్దీ, ఆమె విడిపించుకోటానికి పెనుగులాడుతోంది. ఇద్దరు ముగ్గురు అతని రెక్కలు పట్టుకుని ఉన్నారు -

"ఒరి నా కొడకో - దాన్ని వొదలరా -" అంటూ మీదకి వచ్చిన తల్లిని కాలితో ఓ తాపు తన్నాడు దేవుడు. ఆవిడ జనం మీద పడింది ఆ తన్నుతో పట్టుకున్న వాళ్ళ పట్టు సడలింది. విడిన చేతితో ఒక్క గుద్దు గుద్దాడు. మరొకటి గుద్దబోతూండగా మళ్ళీ పట్టేసుకున్నారు.

కొంతసేపటికి - అతనిని పట్టుకున్న వాళ్ళు అతనిని లాగుతూంటే - అతను మాణిక్యాన్ని లాగుతూంటే - మనవడిని చేతిలోకి తీసుకుని ఏడుస్తూ నరసమ్మ నడుస్తూంటే గుంపు అక్కడ నుంచి కదలింది.

బయ్ బయ్ మంటూ హారన్లు. గేర్లు మారుస్తున్న చప్పుళ్ళు. డ్రైవర్ల తిట్లు. వాహనాలు కదిలాయి. జనాన్ని తప్పించుకోవటంలో చిన్న కార్లు చికాకు పడుతూ 'యింకే దేశం ఎలా బాగుపడుతుం'దని వాపోతున్నాయి.

రోడ్డుకి అడ్డంగా ఉన్న రిక్షాని యిరుగు పొరుగులు యింటికి చేర్చారు.

సమూహాల దేశం ప్రగతి పథంలో కొంతసేపు ఆ సమూహం కల్గించిన అవరోధం లిప్తలో తొలగి పోయింది.

★ ★ ★

కొంతసేపటికి సద్దు మణిగింది.

నాలుగైదు ఎకరాల ఆ జాగాలోనే పది వేలకి ఎక్కీ, తక్కీగా ఉన్న జనం... వాళ్ళ తిళ్ళూ, తిప్పలూ,....వాళ్ళ పెళ్ళిళ్ళూ, కామం, వాళ్ళ చుట్టరికాలూ, స్నేహాలూ, ఆటలూ, పాటలూ, నవ్వులూ, ఏడుపులూ,.....! ఆ తొడ తొక్కిడిలో, చీకటిలో... చిత్తడిలో... నీళ్ళలో .... కలకత్తా

చీకటి గదిలాంటి ఆ పేట అటూ ఇటూ ఒత్తిగిలుతూ నిద్రకు ఉపక్రమించింది.

గవర్నమెంటు వారిచ్చిన సారాతో గుండెలలో మంటలతో, కళ్ళు మూసుకుని ....వాకిట్లో సులక మంచం మీద పడుకున్నాడు దేవుడు.

మాణిక్యం చప్పుడవకుండా లేచి, తన బిడ్డను తీసుకుని బయటకు వచ్చి భర్త పడుకున్న మంచాన్ని దాటుతోంది.

అలికిడికి మెలకువ వచ్చింది. మెలకువ రావడానికి నిద్రంటూ పోతే కదా! కడుపులో ఆకలి చిచ్చులూ, గుండెలో సారా మంటలూ! దాంతో లేచి కూచున్నాడు.

ఎదురుగా బిక్క చచ్చి నిలుచున్న మాణిక్యం.

ఎదిరి పిరికితనం మనిషిలో క్రౌర్యాన్ని రెచ్చగొడుతుంది.

ఒక్క ఊపున లేచి, ఆమె చెయ్యి దొరకబుచ్చుకున్నాడు - "ఏడకే లంజా ఎల్తన్నావ్ -" అంటూ చెయ్యెత్తి మెడ మీద ఓ పెట్టు పెట్టాడు.

"అమ్మో -" అంటూన్న భార్య నోరుని ఒక చేత్తో నొక్కేస్తూ, గదిలోకి లాక్కొని వెళ్ళాడు. ఓ మూలకి తోసేసాడు. మట్టి గోడ మీద పడేసరికి దబ్బున చప్పుడయింది.

మెలకువ వచ్చిన తల్లి 'అయ్యబాబో - చంపేస్తున్నాడు -' అంటూ అరిచేసరికి ఆ గొంతు అతడి కోపాన్ని రెచ్చగొట్టింది. ఒక్క తోపు తోయగా గుడ్డి దీపంకీ కిరసనాయిలు డబ్బాకీ మధ్య పడింది.

క్షణంలో ఆ మెదళ్ళో ఓ మెరుపు.

చటుక్కున దాన్ని అందుకోవటం, ఒక్క అంగలో బయటకు వెళ్ళటం, తలుపు మూసి గొళ్ళెం పెట్టడం, డబ్బా మూత తీయటం, దాన్ని యింటి మీద వెదజల్లటం, పుల్ల తీయటం, గీయటం, వెలగగానే దాన్ని యింటి మీదకు విసరటం, చిన్న మంట మొదలవటం, అది చూడగానే పరుగు అందుకోవటం, వరసగా జరిగి పోయాయి.

"అయ్యబాబోయ్ - అమ్మో - అమ్మో" అరుపులు.

సర్ సర్ సర్ సర్ మని అంటుకొంది.

తెలివి వచ్చిన వాళ్ళు నిద్దట్లో వాళ్ళను లేపుతున్నారు. ఏడూ ఎనిమిదయీ వరకూ బిగుసుకున్న గాలి స్వేచ్ఛగా వీస్తోంది. లేచిన వాళ్ళు సామాన్లు సంరక్షించుకోటంలో పడ్డారు. వేసవి ఎండలకి ఎండిన తాటాకులూ, గోనె గుడ్డలూ, పాలిథిన్ పేపర్లూ నిప్పు కనబడగానే కావలించుకుని ఆహ్వానిస్తున్నాయి.

పది నిముషాల్లో....

జనం! పరుగులు! కేకలు! బిందెలు! తప్పాలాలు! డబ్బాలు! బాల్చీలు! నీళ్ళు! గుడిసెలకెక్కే వాళ్ళు! పెండి కట్లు విప్పుతున్నవాళ్ళు! పై కప్పులను లాగేస్తున్నవాళ్ళు! ఇళ్ళలో సామాన్లు సందుల్లో! గాలి పాటుని బట్టి తమ వేపు రాదనుకునే వాళ్ళు!

అరగంటయీసరికి....

ఫైర్ యింజన్లు వచ్చి ఆ పేటలోకి ప్రవేశించే దోవలేక, పైపు అందక, నీరు చాలక, ఉన్న నీళ్ళను చిమ్ముతూ రోడ్డు మీద నిలబడి పోయాయి.

మానవుడా - నన్ను కనిపెట్టటంతో ప్రారంభమైన నీ బ్రతుకు - నన్ను ఒక చిన్ని అగ్గి పుల్లలో బంధించగలిగానన్న నీ మిడిసిపాటూ - రా- యిప్పుడు చూపించు - చూడు నా తడాఖా - అంటోంది నిప్పు.

అలా ఆ మంటలు మధ్యలో ఆరంభమై... ఉత్తరం వేపు మళ్ళీ దక్షిణం వేపు యింకా మళ్ళని సమయంలో ....

★ ★ ★

డాబా మీద చదువుకుంటున్న కుర్రాళ్ళూ పేకాట ఆడుకుంటున్న కుర్రాళ్ళూ, ఎడ్రినాలి హార్మోన్ శరీరంలో నింపిన వీరావేశంతో ఉరుకులు పరుగులుతో చేతికందిన వాటితో నిప్పు మీద మానవుడు ఆరంభించిన యుద్ధంలో భుజం కలిపారు.

★ ★ ★

రమణమ్మకు మెలకువ వచ్చింది. ఆవిటోబాటు అత్తగారూ, మహలక్ష్మి వసారా లోకి చేరారు. మగాళ్ళు చేరారు వీధిలోకి -

"వీళ్ళెంతటికీ కాళీ చెయ్యటం లేదుట. అందుకని గవర్నమెంటు వాళ్ళే అంటించేసారుట" అంది రవణమ్మ.

కోడలి జ్ఞానానికి నివ్వెరపోతూ అత్తగారు - "నిజవేఁనేంటే?"

మహలక్ష్మి మరో రహస్యం చెప్పింది - "అదేం కాదు అక్కయ్యగారూ! పాపం - పాపం పెరిగి పోయిందండి - మా ఆయన చెప్పారు - అక్కడందరూ దొంగలేనట! ఆ గుడిసెల నిండా బంగారమేట! ఒక్కొక్కళ్ళ దగ్గరా ట్రాన్సిష్టర్లూ, రేడియోలూ, వాచీలూ యింకా యింకా చాలా ఉంటాయిటండీ!"

"అవున్టే!"

"పాపం గాకపోతే... ఏంటి చెప్పండి .... వాళ్ళ వాలకాలు... ఆ వాపిరి గొట్టు మోహాలు... అబ్బబ్బబ్బ!"

"వాళ్ళు అందర్నీ చంపేస్తారుట - ఆ తోటలోకి వెళ్ళి పైకి రావటం ఎంత కష్టమో .... తెలుసా!"

పెరటి గుమ్మం మీద దడ దడా చప్పుడు!

ముగ్గురు ఆడాళ్ళూ ఒకళ్ళ ముఖం ఒకళ్ళు చూసుకున్నారు.

రవణమ్మ వెళ్ళి - ఏం జరిగిందో తెలుసుకుంటున్న మగాళ్ళను పిలిచింది. వాళ్ళు పరుగెత్తుకుని వచ్చారు.

"తల్లుల్లీ! తల్లుల్లీ! తలుపు తియ్యమ్మా! పురటాలు తల్లీ! సామాను లోపలెట్టుకుంటా మమ్మా! మీ సామానుకు మా పూచీ తల్లీ!"

తలుపు అవతల నించి జనం వేడికోళ్ళు.

నిప్పులు తరుముతున్న జనం.

"ఏం చేద్దాం -?" అంది ముసల్తల్లి.

"చేసేదేముంది - తలుపులు తీసేద్దాం - " ఆఖరి కొడుకు అన్నాడు.

"దిక్కుమాలిన్తెలివి - అలగా వాళ్ళు ఉండమన్న చోట ఉంటారా? ఆగమన్నచోట ఆగుతారా? గదుల్లో దూరేస్తారు - అందులోనూ... నానా జాతులూ"

"వాళ్ళేం దొంగలు కారు - అందులో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు చాలా మందున్నారు -" అన్నాడు రెండో కొడుకు.

"ఏం - ఉద్యోగస్తులు దొంగలు కాకూడదా?" ఆఖరి కొడుకు.

"వాళ్ళకి ఆ అవసరం లేదు."

"అందుకే మరి! మీ స్టోర్సు నుంచి రోజుకో రీమ్ పేపర్ వస్తుంది."

"నోర్మూయ్!"

"అబ్బబ్బ - అసలు విషయం తేల్చండి -" అంది తల్లి.

"మనం తేల్చేదేముంది - వాళ్ళే తేల్చేసేలా వున్నారు -"

"పోనీ మన సామాను సర్దుకుని ఆ తర్వాత రానిస్తామంటే -?"

"అందాకా ఆగుతారా -!!"

బయట తలుపు మీద చప్పుడు.

"తల్లల్లీ - అమ్మా -" అరుపులు.

పెళ పెళ మంటున్న వాసాలు, చక్రాల్లా లేస్తున్న నడి కట్టులు. భూమ్యాకాశాలను చుట్టేస్తున్న పొగ. ఎట్టిటి మంటలు. ప్రపంచ పరిస్థితుల్లాంటి మంటలు. అధికారం లాంటి మంటలు. అణచివేత లాంటి మంటలు.

"లాభం లేదు - అసలే మనవి పుచ్చు తలుపులు - విరగ్గొట్టేస్తే చేసేదేముంది - మర్యాదగా రానిస్తే ఆబోరయినా దక్కుతుంది. విశ్వాసమైనా ఉంటుంది -" అంటూ వెళ్ళి తలుపు తీసాడు.

జనం సామాన్లతో, సంసారాలతో ఆనకట్టలు తెగిన ప్రవాహంలా లోపలికి వచ్చేసారు.

నిద్రలో ఉన్నాడు కోటేశ్వర్రావు.

పక్కగదిలోంచి వచ్చిన భార్య నిద్ర లేపింది. కింద గదుల్లో పడుక్కున్న వంటవాడూ, నౌఖరూ వచ్చారు. క్షణాల్లో పరిస్థితి అర్థమయింది. కిటికీల తెరలు తీసేసి, తలుపులు బిగించారు. కిందకి వెళ్ళి అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో చూడమన్నాడు.

మంటలు దూరంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. వేడి మాత్రం సోకుతోంది. భార్య అక్కడ యిల్లు కట్టుకున్న అతని తెలివిని ఎత్తి పొడవ సాగింది.

కోటేశ్వర్రావు ఆమె ముందు నోరు విప్పడు. ఆమె చెప్పిన ఏ పనీ సాధారణంగా చేయడు.

ఆ క్షణంలో అతను విప్పాడు - "చూడు సరోజం - ఆ మంటలను చూసి భయపడకు - అవి మన అదృష్టానికి సంకేతాలు - ఈ తోట ఓనరులతో మాటలు నడుస్తున్నాయి - వాళ్ళు ఎంతో కొంతకు తెగనమ్మేద్దామని చూస్తున్నారు - ఇవన్నీ కాలిపోతే వీళ్ళను యిక్కడ నించి తరిమెయ్యడం సులువు - ఆ బేరం మనం సెటిల్ చేసేసుకుంటే - యీ బంగారపు గని మన సొంతమవుతుంది -" అన్నాడు ఆనందావేశంతో.

భార్యగా ఉన్న సరోజం భర్త ఆనందంలో పాలు పంచుకోవటమే పతివ్రతా ధర్మమని ఆ క్షణంలో గుర్తు వచ్చి ఎంతో ఆనందించింది.

సరిగ్గా అలాంటి సమయంలో కింద నుంచి నౌఖరు పరుగెత్తుకుని వచ్చాడు. వాళ్ళ ఆనందాన్ని భగ్నం చేసాడు -

"పెరటి గుమ్మం తెరవమని తోటలో వాళ్ళు తలుపు బాదుతున్నారు - అందులో అయ్యగారికి సామాన్లు తెచ్చేవోళ్ళుట - ఆళ్ళూ పిలుస్తున్నారు -" అంటూ విషయం చెప్పాడు.

కోటేశ్వరరావు మండి పడ్డాడు. సరోజం కూడా పతివ్రతా ధర్మాన్ని నిర్వహించి మండి పడింది.

"వెంటనే వెళ్ళి తలుపులు వేసెయ్యండి. ఇనప గడియలు కూడా వేసెయ్యండి - కర్రలు పట్టుకుని కాపలా కాయండి - నేను పోలీసులకి ఫోను చేసి రమ్మంటాను -" అంటూ ఆజ్ఞలు జారీ చేసాడు.

అతని గొంతులో - జనం ఎంత ప్రయత్నించినా విరగనంత బలమయినవి తమ తలుపులు అన్న - నమ్మకం ఉంది.

సంఘంలో ఏదో మూల తీరని అవసరాల వల్ల లేచే అలజడి అక్కడే ఉండదు. అది వ్యాపిస్తుంది. తెరుచుకునే తలుపుల్ని తెరిపిస్తుంది. తెరవమని మూసుకున్న తలుపుల్ని పగల గొట్టి వేస్తుంది.

- అని హెచ్చరిస్తున్నట్లుగా నిప్పు జనాన్ని తరుముతూ వ్యాపిస్తోంది. ●

*★ (రచన సచిత్ర మాసపత్రిక: జూలై 1994) ★*